

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న తన్నీరు హరీశ్‌రావు



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సునీతాలక్ష్మారెడ్డి



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చింతా ప్రభాకర్



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మాణిక్‌రావు



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దామోదర రాజనర్సింహ

# దైవసాక్షిగా..

**ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసిన గెలుపొందిన ప్రజాప్రతినిధులు**



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పొన్నం ప్రభాకర్

మెదక్, (నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట/ నర్సాపూర్/ పటాన్‌చెరు/ జహీరాబాద్/ అందోల్ , డిసెంబర్ 9: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారిగా జరిగిన సమావేశాల్లో శనివారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. సిద్దిపేట శాసన సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు ఏడోసారి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నాల్గోసారి ఎమ్మెల్యేగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మూడోసారి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రెండోసారి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. అందోల్ శాసన సభ్యుడు సీ.దామోదర రాజనర్సింహ, హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేయగా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తొలిసారిగా ప్రమాణ స్వీకారం చేశారు. ---అనే నేను అంటూ శాసన సభ్యుడిగా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. వారందరితో తొలి అసెంబ్లీ సమావేశంలో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన అక్బరుద్దీన్ ఓవైసీ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ వారికి అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సంజీవరెడ్డి



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మైనంపల్లి రోహిత్

## మెదక్ కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ రిటేలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం




మాట్లాడుతున్న టీఎస్‌ఆర్‌ఈడీసీవో సిద్దిపేట, మెదక్ జిల్లా అధికారి పి.రామమోహన్

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిసియన్సీ, తెలంగాణ స్టేట్ రెన్యూవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా వన్‌డే వర్క్‌షాప్ రిటేలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను శనివారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్‌ఆర్‌ఈడీసీవో సిద్దిపేట, మెదక్ జిల్లా అధికారి పి.రామ్మోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాము, ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రక్టర్ కె.రామకృష్ణచారి, ప్రోగ్రాం నిర్వాహకురాలు, హెడ్ మినిస్ట్రేటట్ డైరెక్టర్ వసంత, ఎన్‌పీసీ డైరెక్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి శిబిరాలకు 'తారా' అధ్యాపకుడు



డాక్టర్ జగధబుశ్వర్, తారా కళాశాల అధ్యాపకుడు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 9: జాతీయ స్థాయి శిబిరాలకు తారా అధ్యాపకుడు డాక్టర్ జగధబుశ్వర్‌తో పాటు మరో ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికైన అధ్యాపకుడు, వలంటీర్లను శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ అడ్వంచర్ ట్రైనింగ్ శిబిరానికి తమ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జగదీశ్వర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 10 మంది వలంటీర్ల బృందానికి తెలంగాణ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరం హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల 23 నుంచి వచ్చే జనవరి 1 వరకు నిర్వహించనున్నారన్నారు. మధురైలోని కామరాజు విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జరిగే ఈ శిబిరానికి రాష్ట్రం నుంచి 10 మంది వెళ్తుండగా, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తమ విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడం కళాశాలతో పాటు జిల్లాకే గర్వకారణమన్నారు. జాతీయ శిబిరానికి ఎంపికైన బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి జి రంజిత్‌రెడ్డి, బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి పవన్ గౌడ్‌ను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

## మహిళా ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా..?

**ఎమ్మెల్యేను ఆహ్వానించకుండానే మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవం**

- ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థితో ప్రారంభోత్సవమా..!?
- ప్రొటోకాల్ పాటించని ఆర్టీసీ అధికారులు
- ఓటెయ్యలేదనే కక్షతో మురళీయాదవ్ ఇండ్లు కూల్చేపించాడు
- ఎమ్మెల్యేపై తప్పడు ఆరోపణలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్
- ఆయన స్క్రాప్ అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు



నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్, డిసెంబర్ 9: స్థానిక మహిళా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆహ్వానించకుండా ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థితో మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించడం అధికారులకు ఎంతవరకు సమంజసమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్ ధ్వజమెత్తారు. శనివారం నర్సాపూర్‌లో ఆయనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు సముచిత గౌరవం కల్పిస్తామని ఓ వైపు ఆ పార్టీ నాయకులు ఊదరగొడుతూనే, మహిళా ఎమ్మెల్యేను మహాలక్ష్మీ పథకం ప్రారంభోత్సవానికి ఆహ్వానం తెలపకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రొటోకాల్ పాటించకుండా ఆర్టీసీ అధికారులు ప్రారంభోత్సవం చేయడం ఎంటని ప్రశ్నించారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ఇండ్లను కూల్చివేయించి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేరు చెప్పడం తగదని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా బరిలో ఉన్న తనకు ఓటు వేయలేదనే కక్షతోనే మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ పేదల ఇండ్లు కూల్చివేయించడాని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో రావడంతో మురళీయాదవ్ తట్టుకోలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో గెలిచి, నేడు ఇంకా మున్సిపల్ చైర్మన్ పదవిని అంటిపెట్టుకొని ఉన్నాడని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పాత భవనాలను కూల్చివేసి స్క్రాప్‌లో మురళీయాదవ్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. త్వరలోనే వాటన్నిటినీ బయటపెడతామని, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

### మహిళా ప్రాధాన్యం ఎక్కడ..

**– బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి**

కాంగ్రెస్ పాలనలో మహిళా ప్రాధాన్యం ఎక్కడుందని బీఆర్‌ఎస్ నర్సాపూర్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేను కించపర్చే విధంగా మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆహ్వానించకుండా మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయంలో గెలుపు, ఓటములు సహజమని మురళీయాదవ్ కక్షపూరితంగా ఇండ్లను కూల్చేపించాడని విమర్శించారు.

### డిపో మేనేజర్ క్షమాపణ చెప్పాలి

**– బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యంగౌడ్**

ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆహ్వానించకుండా మహిళలకు ఉచిత బస్సును ప్రారంభించిన నర్సాపూర్ డిపో మేనేజర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యంగౌడ్ డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ అధికారులు ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నగేశ్, ఆంజనేయులుగౌడ్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.